క్లుప్తంగా

వైభవంగా ఆలయ వార్షికోత్సవ పూజలు



కొప్పర్రు శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నరసాపురం రూరల్: మండలంలోని కొప్పర్రులో ఉన్న అన్నపూర్ణ, పార్వతి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మల్లాది జోగయ్య శర్మ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన కడలి చంద్రరావు, ప్రబలదేవి, నర్సింహరావు–లావణ్య దంపతులు వనగ్రహ, మృత్యుంజయ హోమాలు నిర్వహించారు.

మొగల్తూరులో భక్తి ర్యాలీ



మొగల్తూరులో భక్తి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మొగల్తూరు: తిరుమల తిరుపతిలో శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని ఆరోపణలు రావడంతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులందరి మనోభావాలు దెబ్బతిన్నాయి. తిరుమల తిరుపతి పవిత్రతను కాపాడాలని కోరుతూ మొగల్తూరు వేంకటేశ్వర స్వామి భక్త బృందం ఆధ్వర్యంలో బుధవారం మొగల్తూరులో భక్తి ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని హిందూ భక్తులంతా పాల్గొన్న ఈ భక్తి ర్యాలీ స్థానిక వేంకటేశ్వర స్వామి గుడి వద్ద ప్రారంభమై పెంకేవారి కాంప్లెక్స్ వరుకు సాగింది.

యలమంచిలి ఎంపీడీఓగా ప్రేమాన్విత



నందిపాటి ప్రేమాన్వితకు స్వాగతం చెబుతున్న సిబ్బంది

యలమంచిలి: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా నందిపాటి ప్రేమాన్విత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఉంగుటూరు ఎంపీడీఓగా పని చేస్తూ బదలీపై ఇక్కడకు వచ్చారు. ఇంత వరకు ఇక్కడ ఎంపీడీఓగా పని చేసిన చివటం త్రిశూలపాణి మొగల్తూరు ఎంపీడీఓగా బదలీపై వెళ్లారు. తొలిసారి కార్యాలయానికి వచ్చిన ప్రేమాన్వితకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.


సన్‌షైన్ స్కూల్‌కు జాతీయ స్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న జేపీ, స్కూల్ డైరెక్టర్ లియో

నరసాపురం: నరసాపురం పరిసర ప్రాంతాల్లో గత 42 సంవత్సరాలుగా ఇంగ్లీష్ విద్యా బోధనలో సేవలందిస్తున్న సన్‌షైన్ స్కూల్‌కు జాతీయ స్థాయి అవార్డు లభించింది. గుజరాత్ కేంద్రంగా నడిచే ది డైరెక్టర్స్ ఆఫ్ న్యూస్ నెట్‌వర్క్ సంస్థ డైనమిక్ స్కూల్ అవార్డు ప్రదానం చేసింది. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఎం.జయప్రసాద్, డైరెక్టర్ ఎంఎస్ లియోలకు అందించారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలల పనితీరును పరిగణలోకి తీసుకుని ఈ సంస్థ ప్రతి ఏటా ఈ అవార్డును ప్రతిష్ఠాత్మకంగా అందిస్తుంది. 2024 సంవత్సరానికి గానూ సన్‌షైన్ స్కూల్‌ను ఎంపిక చేశారు. అవార్డు అందుకున్న జయప్రకాష్(జేపీ)ని రాజకీయ, విద్యా, వ్యాపార రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు అభినందించారు.

వేధింపులపై మహిళలు అప్రమత్తంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి సోమశేఖర్

భీమవరం: స్థానిక మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మహిళలు పని చేస్తున్న ప్రదేశాల్లో ఎదుర్కొంటున్న జెండర్ సెన్సిటైజేషన్, సెక్సువల్ హెరాస్మెంట్లు, వాటిని అరికట్టేందుకు తీసుకునే విధివిధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోక్సో కోర్టు హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్ మహిళలు వేధింపులకు గురైతే తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ జడ్జి బి.అప్పలస్వామి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలి

ఏడీఏ అడ్డాల పార్వతి



పాలకొల్లు అర్బన్: తిల్లపూడిలో రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ అడ్డాల పార్వతి

పాలకొల్లు అర్బన్: తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే దిశగా రైతులు ఆలోచన చేయాలని ఏడీఏ అడ్డాల పార్వతి సూచించారు. మండలంలోని తిల్లపూడి, శివదేవేచిక్కాల గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. రసాయనిక ఎరువుల వినియోగాన్ని రైతులు తగ్గించాలన్నారు. సేంద్రియ సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని పార్వతి రైతులకు వివరించారు. అలాగే వర్షం కారణంగా సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని వాయిదా వేశారు. ఏఓ కె.రాజశేఖర్, రైతులు నడపన వెంకట సుబ్బారావు, బోడపాటి కాశి, ఇంటి శ్రీరాముడు, గురుజు రాజబాబు వ్యవసాయ విస్తరణాధికారి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అబ్బిరాజుపాలెంలో..

యలమంచిలి: వరి సాగు చేసే రైతులు విచ్చలవిడిగా పురుగు మందులు పిచికారి చేయవద్దని నరసాపురం ప్రాంతీయ సహాయ వ్యవసాయ సంచాలకులు ఈద అనిలకుమారి కోరారు. మండలంలోని అబ్బిరాజుపాలెం, ఇలపకుర్రు గ్రామాలలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రైతులకు ఆమె మిత్ర పురుగులకు సంబంధించిన ఉపయోగాలు వివరించారు. పంట మీద విపరీతంగా పురుగు మందులు పిచికారి చేయడం వల్ల మిత్ర పురుగులు చనిపోయి, పంటకు హానిచేసే శత్రు పురుగులకు మందుని తట్టుకునే శక్తి వస్తుందన్నారు. ఏ విధమైన రసాయనిక పురుగు మందులు పిచికారి చేయకుండా ప్రకృతి వ్యవసాయంలోని నీమాస్త్రం, అగ్నాస్త్రంలను పిచికారి చేయడం ద్వారా పురుగులను, తెగుళ్లను అదుపులో పెట్టవచ్చునని ఆమె రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి, మండల పశు వైద్యాధికారి డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, వెటర్నరీ, ఫిషరీస్, అగ్రికల్చర్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

జిన్నూరులో..

పెనుగొండ: వరిసాగులో స్ప్రేయింగ్ చేసుకోవడానికి డ్రోన్ సదుపాయం మార్టేరు వరి పరిశోధనా స్థానంలో అందుబాటులో ఉందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పోడూరు మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ అన్నారు. బుధవారం పోడూరు మండలం జిన్నూరు, మట్టపర్రుల్లో జరిగిన పొలం పిలుస్తోంగి కార్యక్రమంలో పాల్గొని రైతులకు సూచనలు చేశారు. ప్రతి రైతూ తప్పని సరిగా విత్తన శుద్ధి చేయడం ద్వారా ఆకు ఎండు తెగులుని నివారించుకోవచ్చన్నారు. రైతులు నీటి యాజమాన్యం పాటించాలని, నత్రజని ఎరువులు సిఫారుసు మేరకు మాత్రమే వినియోగించాలన్నారు. ప్లాంటో మైసిన్ 1 గ్రాము నీటరు నీటికి, కాపర్ హైడ్రాక్సైడ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. సాంకేతిక పరిజానాన్ని వినియోగించుకొని సాగు ఖర్చు తగ్గించుకోవాలన్నారు. మండల పశువైద్యాధికారి మహేష్ కుమార్ మాట్లాడుతూ పశువులకు వేయించాల్సిన టీకాలు, వ్యాధులపై రైతులు అవగాహన పెంచుకొని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమాలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు దొమ్మేటి శ్రీను, జమ్ము బేబీ మహాలక్ష్మి, కేతా హరికృష్ణ, గుబ్బల వెంకటేశ్వరావు, సూర్యకిరణ్, వీఏఏలు చిరంజీవి, సుమతి, దేవల్ల రామకోటి, పాలవలస తులసీరావు, కుక్కల సత్యానారాయణ, దాసరి సూర్యనారాయణ, సొసైటీ కార్యదర్శి రామకృష్ణ తదిదతరులు పాల్గొన్నారు.



యలమంచిలి: అబ్బిరాజుపాలెంలో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు



పెనుగొండ: పోడూరు మండలం జిన్నూరులో రైతులకు సూచనలు ఇస్తున్న దృశ్యం

ఎలుకల నివారణ మందు పంపిణీ నేటికి వాయిదా

మొగల్తూరు: సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఉచితంగా అందించే బ్రోమోడయోల్ మందు పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నాటికి వాయిదా వేసినట్లు మండల వ్యవసాయాధికారి అబ్దుల రహీమ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి వర్షం పడుతున్నందున నేటికి వాయిదా వేశామని, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రిశూల పాణి

మొగల్తూరు: స్వర్ణాంధ్ర –2047కు సంబంధించి మండలంలో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీవో సిహెచ్ త్రిశూల పాణి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాప్రతినిదులు, వివిధ సంఘాల నాయకులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలతో సమావేశాలు ఏర్పాటు చేసి స్వర్ణాంధ్ర –2047కు సంబంధించి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలన్నారు.

ఘనంగా దీనదయాళ్ జయంతి



దీనదయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ 108వ జయంతిని ఘనంగా నిర్వహించారు. బుధవారం బోడ కనకరాజు నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దీనదయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపి పట్టణ అధ్యక్షులు జక్కంపూడి కుమార్ మాట్లాడుతూ దీన దయాళ్ సేవలను కొనియాడారు. అనంతరం సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొల్లి నరసింహమూర్తి, అడ్డాల తులసిదాస్, బొక్క నరసింహమూర్తి, కొల్లి కొండప్రసాద్, బోడ కనకరాజు, బైల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ మురళీకృష్ణ

నరసాపురం: విద్యార్థులు ర్యాగింగ్ లాంటి విషసంస్కృతుల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోకూడదని నరసాపురం డీఎస్పీ ఎస్‌బీ మురళీకృష్ణ సూచించారు. బుధవారం పట్టణంలోని శ్రీ సూర్యా కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలన్నారు. చెడు వ్యసనాలు, చెడు సంస్కృతులపై ఆకర్షణ పెంచుకుంటే జీవితంలో పతనం తప్పదన్నారు. ముఖ్యంగా సెల్‌ఫోన్ వాడకాన్ని తగ్గించాలని చెప్పారు. ఉమెన్, బాలికలపై అనుచితంగా ప్రవర్తిస్తే పోక్సో చట్టం ప్రకారం శిక్ష పడుతుందని హెచ్చరించారు. యువతులు, బాలికలు తమను ఎవరైనా వేధిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నరసాపురం టౌన్ సీఐ బి.యాదగిరి, ఎస్సై జయలక్ష్మి, కళాశాల కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ పాల్గొన్నారు.


వ్యర్థాల నిర్వహణపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పురపాలక సంఘం పరిధిలో పారిశుద్ధ్యం,ఘన వ్యర్థాలు నిర్వహణపై ప్రత్యేక దృష్టి సాధించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. బుధవారం జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి స్థానిక భీమవరం మున్సిపల్ కార్యాలయం నందు సమావేశమై పురపాలక సంఘం పరిధిలో పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాలు నిర్వహణపై ప్రజా ఆరోగ్య సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఘన వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధించడానికి ఆదేశాలు జారీ చేశారు. 120 మైక్రాన్లకన్నా తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ వాడకంపై నిషేధం ఉన్న కారణంగా వ్యాపారస్తులు, వినియోగదారుల ప్లాస్టిక్ వినియోగంపై ఆలోచన చేయాలని, ప్లాస్టిక్ కవర్ల స్థానంలో జ్యూట్ బ్యాగులను, పేపర్ కవర్స్ ను వినియోగించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సింగిల్ యూస్ ప్లాస్టిక్ లేదా 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ ను వినియోగించిన వారికి పెనాల్టీలు విధించడం వలసిందిగా ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్, ప్లాస్టిక్ వస్తువులపై తయారీ లేదా విక్రయదారులే సదరు ప్లాస్టిక్ వ్యర్థాల పునర్వినియోగం చేయడం, శాస్త్రీయ పద్ధతిలో వాటిని ప్రాసెస్ చేసే విధానంలో ప్రథమ బాధ్యతను కలిగి ఉంటారన్నారు. రానున్న రెండు వారాల్లోపు పట్టణంలో దుకాణదారులు వారి నుంచి వచ్చే ప్లాస్టిక్ వ్యర్థాలను వారి ద్వారానే సక్రమ పద్ధతిలో పునర్వినియోగం లేదా ప్రాసెస్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ వ్యర్థాలను కలిగి ఉన్న వారిపై భారీ జరిమానాలను విధించడమే కాకుండా, వారి షాపుల లైసెన్సు రద్దు చేయడం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, పురపాలక సంఘం ఇంజనీర్లు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారులతో డీపీవో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో విక్టర్

ఉండి: మండల ప్రత్యేకాధికారులతో జిల్లా పంచాయతీ అధికారి విక్టర్ బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పీఎం ఆవాస్ యోజన కార్యక్రమంలో గ్రామాల్లో రూఫ్ లెవల్ స్థాయిలో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణం అక్టోబర్‌లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 28న మన ఇల్లు మన గౌరవం కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల్లో లేఅవుట్ల లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి, ఇళ్ల నిర్మాణంపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం స్వర్ణాంధ్ర 2047 వంటి అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.రవీంద్ర, గృహ నిర్మాణ ప్రత్యేకాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిస్టులకు సాంకేతిక పరిజ్ఞానం అవసరం

భీమవరం: ఫార్మాసిస్టులకు కొత్తసాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని దానికోసం నాలుగు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పీసీఐ అధ్యక్షుడు డాక్టర్ మొంటు కుమార్ పటేల్ అన్నారు. భీమవరం విష్ణు ఫార్మసీ కళాశాలలో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా విష్ణు ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఫార్మసిస్ట్ ట్రైన్ ది ట్రైనర్ అనే ఆన్‌లైన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని 12 వేల మంది ఫార్మసిస్టులకు శిక్షణ ఇస్తున్నామని సౌత్ ఇండియాలో విష్ణు ఫార్మసీ కళాశాలలోనే మొట్టమొదటగా శిక్షణ కార్యక్రమం ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కేఎస్ నటరాజ్, క్యాంపస్ డైరెక్టర్ ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

పాలకోడేరు: పెండింగ్ కేసులను కాలయాపన లేకుండా సత్వరమే పరిష్కరించాలని భీమవరం రూరల్ సీఐ బి.శ్రీనివాసరావు ఆదేశించారు. వార్షిక తనిఖీలో భాగంగా ఆయన బుధవారం పాలకోడేరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, పలు సూచనలు చేశారు.

నేడు డయల్ యువర్ డీఎం

నరసాపురం: ఆర్టీసీ ప్రయాణీకుల సమస్యల పరిష్కారం కోసం గురువారం ఉదయం 11 గంటలు నుంచి 12 గంటలు వరకూ డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్టీసీ డీఎం ఎస్.సుబ్బన్నరెడ్డి చెప్పారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కార్గో సేవలు, బస్సులకు సంబందించిన ఇబ్బందులపై సలహాలు, సూచనలు, ఫిర్యాదులుంటే 99592 25486 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

బాలికను మోసం చేసిన వ్యక్తిపై కేసు

యలమంచిలి: కొంతేరు గ్రామానికి చెందిన మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటానని మోసం చేసి గర్భవతిని చేసిన వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కర్ణీడి గుర్రయ్య చెప్పారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం పోడూరు మండలం పైడావ గ్రామానికి చెందిన వేడంగి వంశీ మైనర్ బాలికను మోసపూరిత మాటలతో మైపరచి తల్లిని చేశాడు. దీంతో మోసపోయానని తెలుసుకున్న ఆ బాలిక ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

బ్యాటరీల దొంగతనంపై కేసు

యలమంచిలి: మండలంలోని శిరగాలపల్లి పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎనిమిది బ్యాటరీలు దొంగతనానికి గురయ్యాయని పంచాయతీ కార్యదర్శి పీతల రాజశేఖర్ బుధవారం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కర్ణీడి గుర్రయ్య తెలిపారు. చెత్త రిక్షాలు, చెత్త ట్రాక్టర్లకు చెందిన పాత బ్యాటరీలు పంచాయతీ కార్యాలయం వెనుక భద్రపరచగా దొంగతనానికి గురైనట్లు కార్యదర్శి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గుర్రయ్య వివరించారు.

గర్భిణులకు సీమంతాలు



శివదేవునిచిక్కాలలో గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

పాలకొల్లు అర్బన్: గర్భిణులు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన పిల్లలు పుడతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్.మంగ అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని శివదేవునిచిక్కాలలో ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర ఆదేశాల మేరకు బుధవారం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. పండంటి బిడ్డకు జన్మనివ్వాలని ఆశీర్వదిస్తూ గర్భిణులకు పసుపు, కుంకుమ, గాజులు, పూలు, చీర, జాకెట్, పండ్లు అందజేశారు. అలాగే ఆకు కూరలు, రాగులు, జొన్నలు, సజ్జలతో తయారు చేసిన ఆహార పదార్థాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పులఖండం సత్యవేణి, ఎస్ఎన్ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల చదువు సమాజానికి వెలుగు



పూలపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఏఎస్సై ఎస్ మార్లింగం

పాలకొల్లు అర్బన్: ఆడపిల్లలు చదువుకుంటే సమాజానికి వెలుగునిస్తుందని పట్టణ ఏఎస్సై ఎస్.మార్లింగం అన్నారు. మండలంలోని పూలపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆడపిల్లలను చదవనిద్దాం–ఆడపిల్లలను ఎదగనిద్దాం కార్యక్రమంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్సై మార్లింగం మాట్లాడుతూ ప్రతీ విద్యార్థిని క్రమశిక్షణతో చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని కోరారు. ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి, హెచ్ఎం జీటీవీ కుమార్, శ్రీహరిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరపి లేని వర్షంతో ఇక్కట్లు



యలమంచిలి: ఏనుగువానిలంక పాత హరిజనపేటలో వర్షపు నీటిలో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు



మొగల్తూరు: గాంధీ బొమ్మల సెంటర్ నుంచి స్టేషన్‌కు వెళ్లే రహదారిలో నిలిచిన వర్షపునీరు

యలమంచిలి: ఏనుగువానిలంక గ్రామ పరిధిలోని పాత హరిజనపేటలో కొద్దిపాటి వర్షానికే రోడ్లన్నీ జలమయమవుతున్నాయి. వర్షం కురిసిన ప్రతిసారీ రోడ్డు ముంపుకు గురవ్వడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం తగ్గినా రోడ్డు పక్కల మురుగు నీరు నిల్వ ఉండి, నీరంతా పచ్చ రంగులోనికి మారుతుందని స్థానికులు వాపోతున్నారు. మురుగునీటిలో దోమలు విపరీతంగా పెరగడంతో కాలనీ వాసులంతా జ్వరాలతో బాధ పడుతున్నారు. వర్షపు నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు పంచాయతీలో వినతిపత్రం ఇచ్చిన స్పందించడం లేదని స్థానికులు పాలపర్తి సందీప్‌కుమార్, మనోజ్‌కుమార్, రాజు ఆరోపించారు. ఈ వర్షపు నీటిలోనే నడుచుకుంటూ విద్యార్థులు, అంగన్‌వాడీ పిల్లలు పాఠశాలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్తున్నారని, ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు చెప్పారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి మురుగు సమస్య తీర్చాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

పల్లపు ప్రాంత్రాలు మునక

మొగల్తూరు: బంగాళాఖాతంలోని ఉపరితల ఆవర్తనంతో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మండలంలో గత రాత్రి నుంచి వర్షం కురుస్తుంది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరుకు సుమారు 22.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దీంతో మొగల్తూరులోని పలు పల్లపు ప్రాంతాలతో పాటు గొల్లగూడెం, స్టేషన్ రోడ్, కోట రోడ్డు, తదితర ప్రాంతాలలో రహదారుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలను వినియోగించుకోవాలి



మార్టేరులో ప్రభుత్వ పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పితాని

పెనుమంట్ర: ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. నాడు నేడులో భాగంగా గత ప్రభుత్వ హయాంమార్టేరు శివరావు పేటలో రూ.13.48 లక్షలతోనూ, నెగ్గిపూడి కాలనీలో రూ.31.32 లక్షలతోనూ, వనంపల్లిలో రూ.17.85 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదుల భవనాలను ప్రారంభించారు. గతంలోనే దాదాపుగా పనులు పూర్తయినా ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో ప్రారంభం కాలేదు. బుధవారం ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఆయా భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కర్రి గౌరీ సుభాషిణి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు మట్టా కుమారి రాము, మామిడిశెట్టి ధనలక్ష్మీ, ఎంపీటీసీ సభ్యుడు పెనుగొండ లక్ష్మీ, సొసైటీ అధ్యక్షుడు అల్లం భాస్కర రెడ్డి, ఉప సర్పంచ్‌లు కర్రి వేణుబాబు, అల్లం సాయి రెడ్డి, తమనంపూడి శ్రీనివాస్ రెడ్డి, ఎలకల మల్లికార్జున రెడ్డి, కడలి వెంకటేశ్వరావు, రూబీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం

పెనుగొండ: బుడమేరు ముంపు బాధితుల సహాయార్థం వడలి గ్రామస్థులు రూ.42వేలు విరాళాన్ని అందించారు. బుధవారం ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ చేతులకు చెక్కును అందించారు. బాధితులకు అండగా నిలిచిన గ్రామస్థులకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

వరద బాధితులకు విరాళం అందజేత

యలమంచిలి: విజయవాడ వరద బాధితుల సహాయార్థం కట్టుపాలెం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రజల నుంచి రూ. 24,321 విరాళాలు వసూలు చేశారు. ఆ విరాళాల చెక్కును ప్రధానోపాధ్యాయుడు గోటేటి వెంకట శేషసాయి, విద్యా కమిటి చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు బుధవారం భీమవరం వెళ్లి ఆర్జేడీ నాగమణికి అందజేశారు. ఈ సందర్భంగా విరాళాలు సేకరించిన విద్యార్థులను, వారిని ప్రోత్సాహించిన ఉపాధ్యాయులను ఆమె అభినందించారు.